క్లుప్తంగా

ప్రశాంతంగా పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష



హాల్ టిక్కెట్లను తనిఖీ చేస్తున్న సీఐ దుర్గారావు ఇతర సిబ్బంది

రామచంద్రపురం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష రామచంద్రపురంలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని వీఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాల, ఎ.అగ్రహారంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1055 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 916 మంది వచ్చినట్టు రామచంద్రపురం డీఎస్పీ ఎం.బాలచంద్రారెడ్డి వివరించారు. మొత్తం రెండు కేంద్రాల వద్ద డీఎస్పీ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. హాల్‌టిక్కెట్లను తనిఖీ చేసి అభ్యర్థులను కేంద్రానికి పంపించారు. పరీక్షా కేంద్రాలైన కిట్స్, వీఎస్ఎం కళాశాల పరిసర ప్రాంతాల్లో 144సెక్షన్‌ను విధించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

కాజులూరు: పెనుమళ్లలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఆదివారం గ్రామానికి చెందిన జి.శ్రీనివాస్, గణేష్, సాయి తదితరులు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో కుళాయిల ద్వారా గత వారం రోజులుగా తాగునీరు సరఫరా కావడంలేదన్నారు. ఈ విషయంపై సంబంధిత పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటంలేదన్నారు. బావులు సైతం వినియోగంలో లేకపోవడంతో తాగునీటి ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు నాగ సందీప్, నూకరాజు తదితరులు కోరుతున్నారు.

సచివాలయాల మండల కన్వీనర్‌గా శ్రీనివాస్



పాలింగి శ్రీనివాస్

కపిలేశ్వరపురం: సచివాలయాల మండల కన్వీనర్‌గా పడమర ఖండ్రికకు చెందిన పాలింగి శ్రీనివాస్ నియమితులైనట్టు ఆదివారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పార్టీ కార్యాలయ ప్రతినిధి తెలిపారు. సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించేందుకు ఒక్కో సచివాలయానికి కమిటీలను ఏర్పాటు చేశారు. ఆయా కమిటీలను పర్యవేక్షించేందుకు మండల కన్వీనర్ నియామకం చేపట్టామన్నారు. సచివాలయ స్థాయీ కన్వీనర్లను సమన్వయం చేసుకుంటూ మండల స్థాయిలో వైఎస్సార్ సీపీ సంక్షేమ లక్ష్యాన్ని నెరవేర్చేలా కృషి చేస్తానని పాలింగి శ్రీనివాస్ అన్నారు.

బాబా పాదుకలకు పూజలు

కాజులూరు: స్థానిక సాయిబాబా ఆలయంలో బాబా వారి సువర్ణ పాదుకలకు ఆదివారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. మహారాష్ట్ర అక్కల్‌కోట సాయినాథ్ మహరాజ్‌కు చెందిన సువర్ణ పాదుకలు భక్తుల దర్శనం కోసం కాజులూరు సాయిబాబా ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయ నిర్వాహకులు సాయి మాష్టారు ఆధ్వర్యంలో పాదుకలను ఊరేగించి, ఆలయంలో ఉంచారు. పరిసర గ్రామాల భక్తులు సాయి పారాయణలు ఆలపిస్తూ పాదుకలను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ టెస్టు

రామచంద్రపురం: ఇంటర్ విద్యలో అత్యుత్తమ ప్రమాణాలతో జేఈఈ, నీట్ ఓరియంటేన్‌లో నిర్వహిస్తున్న ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లలో ఫ్రీ, స్కాలర్ షిప్ అందజేసేందుకు ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులకు మోడరన్ కళాశాలలో ఆదివారం పరీక్షలు నిర్వహించారు. ఈ విషయం విద్యా సంస్థల అధినేత జీవీరావు స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఇంటర్ ప్రిన్సిపాల్ సీహెచ్ రాజేష్ విద్యార్థుల తల్లిదండ్రులు పలు సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ప్రిలిమినరీ పరీక్షలో టాపర్లుగా నిలిచిన వివిధ హైస్కూల్స్ విద్యార్థులను మెమెంటోలతో సత్కరించారు. మోడరన్ విద్యా సంస్థల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా డ్రైనేజీ పనులు

రంగంపేట: కోటపాడు గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామానికి మంజూరైన నిధులతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆదివారం ఈ పనులను గ్రామ సర్పంచ్ గవరసాని లక్ష్మీదుర్గ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ గుగ్గిల వెంకటేశ్వరరావు పరిశీలించారు. డ్రైనేజీ నిర్మాణంపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు గవరసాని రాజు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని త్రుటిలో ప్రమాదం తప్పింది. ఆదివారం తొస్సిపూడి వద్ద కల్వర్టు నిర్మాణం పనులు భాగంగా బలభద్రపురం వెళుతున్న వాహనాలు పందలపాక మీదుగా వస్తున్నాయి. అయితే పందలపాక మసీద్ వద్ద ఉన్న కాలువ దగ్గరకు వచ్చే సరికి లోడుతో ఉన్న లారీ మలుపు తిప్పలేక కాలువలోని పడబోయి నిలిచిపోయింది. దీంతో సుమారు రెండు గంటలకు ట్రాఫిక్ నిలుచిపోయింది. స్థానికులు సాయంతో లారీ వెనుక తీసుకువచ్చారు. ప్రమాదం తప్పిందన్నారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం



సోమగుండం మధ్యలో ఏర్పాటు చేసిన మహాశివుడు

- సోమగుండం చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం
- రూ.57లక్షలతో సుందరీకరణ పనులు

రాయవరం: చారిత్రక ప్రాముఖ్యత కలిగిన బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న సోమగుండం లక్షలాది రూపాయలతో సుందరీకరణ పనులు చేపట్టారు. సోమగుండం వద్దకు వెళ్లగానే ఆహ్లాదకరంగా ఆరోగ్యం లభించేలా చేపట్టిన పనులు ప్రతి ఒక్కరినీ అలరిస్తున్నాయి. ఒక నాడు చెత్తకుప్పలతో, పిచ్చి మొక్కలతో ఉన్న సోమగుండం చెరువును చూసిన వారంతా ఇప్పుడు ఆహా అనిపించేలా అభివృద్ధి చేశారు. మహాకాశీలో మాదిరిగానే సోమేశ్వరస్వామి ఆలయం ఎదురుగా సోమగుండం, రుద్రభూమిని ఆలయ నిర్మాణ సమయంలోనే ఏర్పాటు చేయడం ఈ ఆలయం ప్రత్యేకతగా భక్తులు చెబుతారు.

అలరిస్తున్న రుద్రుని విగ్రహం

ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయానికి అష్ట దిక్కుల్లో చారిత్రక శివాలయాలను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా వాయువ్య దిక్కున సోమేశ్వరంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి, పడమరన వెంటూరులోని ఉమా సమేత సోమేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. వాయువ్య దిక్కున నిర్మించిన సోమేశ్వరంలోని ఆలయం ఎదురుగా అతి పెద్ద సోమగుండాన్ని ఏర్పాటు చేశారు. మండపేటకు నాళం భీమయ్య కుటుంబీకులు ఈ ఆలయాన్ని 1788లో నిర్మించినట్టుగా చారిత్రక ఆధారాలున్నాయి. అప్పటి నుంచి సోమగుండం అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుత సర్పంచ్ ఆరిఫ్ సోమగుండం అభివృద్ధిపై దృష్టి సారించారు. సోమేశ్వరం–రాజానగరం ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న సోమగుండం మధ్యలో తీర్చిదిద్దిన సోమేశ్వరస్వామి విగ్రహం భక్తులనే కాకుండా ప్రయాణికులను ఆకట్టుకుంటోంది.

రూ.57లక్షలతో సుందరీకరణ

సోమగుండం చెరువును రూ.57లక్షలతో అభివృద్ధి చేశారు. శివుని విగ్రహం దగ్గరకు వెళ్లేందుకు రూ.10 లక్షలతో కాలినడక వంతెన, చెరువుకు దక్షిణం వైపు గోడ నిర్మాణానికి రూ.33 లక్షలు, ఇరువైపులా స్నాన రేవులకు రూ.5 లక్షలు, సోమగుండం చుట్టూ రూ.4 లక్షలతో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. దీంతో సోమగుండం చెరువు చూడముచ్చటగా మారింది.

సంతృప్తినిచ్చింది



ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహకారంతో ఆలయ అభివృద్ధిని చేపట్టాం. చారిత్రక ప్రాముఖ్యత కలిగిన సోమగుండం అభివృద్ధిని పూర్తి స్థాయిలో చేపట్టడం సంతృప్తినిచ్చింది. గ్రామస్తుల కోరిక మా పాలకవర్గంలో పూర్తి చేయడంతో సంతోషంగా ఉంది. వాకింగ్ ట్రాక్ చుట్టూ ఫెన్సింగ్‌ను త్వరలోనే పూర్తి చేస్తాం.

– ఆరిఫ్, సర్పంచ్, సోమేశ్వరం, రాయవరం మండలం

ముత్యాలమ్మా.. కాపాడమ్మా..

- వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



రాయవరంలో ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

రాయవరం: ముత్యాలమ్మ తల్లీ.. మమ్ము కాపాడమ్మా అంటూ మహిళలు ముత్యాలమ్మ అమ్మవారిని వేడుకున్నారు. అమ్మవారికి అడుగడుగునా పుసుపు నీళ్లతో స్వాగతించి, పసుపు, కుంకుమ, నైవేద్యాలను సమర్పించుకున్నారు. గ్రామదేవత పోలమ్మ అమ్మవారి జాతరకు ముందుగా రాయవరంలో ప్రతి ఏటా ముత్యాలమ్మ అమ్మవారి జాతర జరగడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఆదివారం ఉదయం ముత్యాలమ్మ అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. కొప్పు వెలమ కులస్తుల ఆరాధ్యదైవంగా ఉన్న ముత్యాలమ్మ అమ్మవారికి కొప్పు వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాతర నిర్వహించారు. జాతరలో భాగంగా ఉదయం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేసిన వాహనంలో ఊరేగించారు. మహిళలు బిందెలతో పసుపు నీళ్లు పోసి ముత్యాలమ్మ అమ్మవారిని స్వాగతించారు. బాణసంచా కాల్పులు, గరగనృత్యాలు, తీన్‌మార్, గారడీలు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నౌడు వెంకటరమణ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వీధుల్లో మట్టిగుట్టల తొలగింపు



ద్రాక్షారామ ప్రధాన రహదారిలో మట్టి దిబ్బలను తొలగిస్తున్న జేసీబీ

రామచంద్రపురం రూరల్: ఆధ్యాత్మిక క్షేత్రం ద్రాక్షారామలో ఏళ్ల తరబడి ప్రధాన రహదారితో పాటు వీధుల్లో పేరుకుపోయిన మట్టి దిబ్బలను గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ నేతృత్వంలో రెండు రోజులుగా పొక్లెయిన్‌తో తొలగిస్తున్నారు. వార్డు సభ్యులు దగ్గరుండి తమ ప్రాంతాల్లో మట్టి దిబ్బలను తొలగిస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ అరుణ మాట్లాడుతూ రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఇచ్చిన స్వచ్ఛ రామచంద్రపురం నియోజకవర్గం పిలుపు మేరకు పుణ్యక్షేత్రం అయిన ద్రాక్షారామను స్వచ్ఛత పరంగా మంచి స్థానంలో నిలపాలని ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. ప్రతి కూడలిలోనూ, భీమేశ్వరాలయం, ఆర్టీసీ కాంప్లెక్స్, పీహెచ్‌సీ తదితర ప్రధాన ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లలో వ్యర్థాలను వేయాలని ప్రజలకు ఆమె విజ్ఞప్తి చేశారు.

చింతాలమ్మను దర్శించిన డీఎస్పీ



డీఎస్పీ బాలచంద్రారెడ్డిని సత్కరిస్తున్న చింతాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు

రాయవరం: గ్రామ దేవత చింతాలమ్మను రామచంద్రపురం డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతలు ఆ ప్రాంత ప్రజల నమ్మకానికి ప్రతిరూపాలుగా నిలుస్తారన్నారు. అనాదిగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సర్పంచ్ కడలి పద్మావతి, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారువెంకటరెడ్డి, రామచంద్రపురం మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవిశ్రీధర్ మాట్లాడుతూ భక్తుల విశ్వాసానికి ప్రతీకగా చింతాలమ్మ అమ్మవారు నిలుస్తున్నారన్నారు. చింతాలమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకుని సుమారు 10 వేల మందికి భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ బాలచంద్రారెడ్డిని ఘనంగా సత్కరించారు. సొసైటీ చైర్మన్ చింతా రామ్మోహన్‌రెడ్డి, గ్రామ పెద్దలు చింతా సుబ్బారెడ్డి, చైతన్య రాజబాబు, పోతంశెట్టి సత్యస్వరూపరెడ్డి, కొవ్వూరి శ్రీనివాస రెడ్డి, పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి, కమిటీ సభ్యులు నల్లమిల్లి వెంకన్నబాబు, కర్రి ఆదిరెడ్డి, పోతంశెట్టి సత్తిబాబు, చింతా సురేష్‌రెడ్డి, నల్లమిల్లి చినసత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణంపై హక్కు ఎవరిదో తేల్చాలి



ద్రాక్షారామ శ్రీ పీవీఆర్ హైస్కూల్ ఎదుట సమావేశమైన పెద్దలు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో ఉన్న పీవీఆర్ హైస్కూల్, కళాశాలలు, క్రీడా ప్రాంగణంపై హక్కు ఎవరిదో తేల్చాల్సిన అవసరం ఉందని సీనియర్ న్యాయవాది, రామచంద్రపురం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మాగాపు అమ్మిరాజు ఆదివారం డిమాండ్ చేశారు. పార్టీలకు అతీతంగా ద్రాక్షారామ, పరిసర గ్రామాల పెద్దలు, యువకులతో ఆదివారం ఆయన పీవీఆర్ హైస్కూల్ ఎదుట సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1953లో విద్యా సంస్థకు పైండా వంశస్తులు, ద్రాక్షారామ పరిసర గ్రామాలకు చెందిన పలువురు విరాళాలు, నలుగురు దాతలు నాలుగెకరాల స్థలం ఇచ్చారన్నారు. ఇటీవల ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేసిన క్రమంలో హైస్కూల్, కళాశాల మూతపడినా పీవీఆర్ క్రీడా ప్రాంగణాన్ని స్థానిక, పరిసర గ్రామాల క్రీడాకారులు వినియోగించుకుంటున్నారు, అయితే వారిని పైండా వంశస్తులు అడ్డుకుంటున్నారన్నారు. ప్రజా విరాళాలతో నిర్మించిన విద్యా సంస్థలు ప్రజలకే చెందుతాయని దీనిపై పైండా వారు ఎందుకు హక్కు చాలాయిస్తున్నారని, ఈ స్థలంపై హక్కు ఎవరితో తేల్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, పెద్దలు నామా వెంకన్నబాబు, పోతంశెట్టి పెదబాబు, గంపల సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

యువ నాయకత్వంపైనే దేశ భవిష్యత్



యువనాయకత్వంపై శిక్షణ ఇస్తున్న శ్రీనివాసచౌదరి

రాయవరం: యువ నాయకత్వంపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని విశ్వమానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో యువనాయకత్వం కార్యక్రమంపై రెండు రోజుల శిక్షణ నిర్వహించారు. మండలంలోని మాచవరం, రాయవరం, వెంటూరు, లొల్ల, పెదపూడి మండలం జి.మామిడాడ తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు, యువకులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసచౌదరి మాట్లాడుతూ స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని యువత నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. యూత్ నాయకత్వం, యూత్ లీడర్‌షిప్ ప్లానింగ్, గ్రూపు డిస్కషన్, యోగ, ఆహారం, ఆరోగ్యం, దేశాభివృద్ధిలో యువత పాత్ర, యువ నాయకత్వం ఆవశ్యకత తదితర అంశాలపై విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పప్పు శ్రీనిసారెడ్డి, యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో పారదర్శకత పాటించాలి



ఎల్ఎన్‌పురం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పారదర్శకత పాటించాలని ఎమ్మెల్యే డాక్టర్‌సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామం శివారు ఎల్ఎన్ పురంలో వాటర్ ట్యాంకునిర్మాణ పనులు ఎమ్మెల్యే ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ పనులు ఎంత మేర జరిగాయో, ఎప్పటిక పూర్తవుతాయో, పనులు ప్రజల పర్యవేక్షణలో జరుగుతున్నాయో లేదో అని అధికారులు, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పనులు సకాలంలో పూర్తి చేసి వాటర్ ట్యాంకు వినియోగంలోకి తీసుకురావాలన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు లోపిస్తే సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచి మేడపాటి తాతారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి వెంకట పద్మావతి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, పైన సొసైటీ చైర్మన్ సబ్బెళ్ల అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్తెమ్మల తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే

జి.మామిడాడ గ్రామ శివారు ఎల్ఎన్‌పురంలో సత్తెమ్మ తల్లి జాతర సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వెంట వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మారెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు ద్వారంపూడి ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

బిక్కవోలు: స్థానిక జవ్వల దొడ్డి వద్ద కొలువైన సత్తెమ్మ తల్లి అమ్మవారిను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దర్శించుకున్నారు. ఆదివారం అమ్మవారి జాతర, తీర్థం మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలోని హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ ఉస్మాన్ భాషా, వైఎస్సార్ సీపీ మండల యువజన అధ్యక్షుడు గువ్వల సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ కల్వర్టు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

తొస్సిపూడిలో రూ.25 లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ కల్వర్టు పనులను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదివారం పరిశీలించారు.

కళలతో ప్రజలను చైతన్యపరచాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ స్టాలిన్

రామచంద్రపురం: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివిధ కళారూపాలతో ప్రజలను చైతన్యం చేయాలని ప్రజా నాట్యమండలి సీనియర్ నేత డాక్టర్ చెలికాని స్టాలిన్ పిలుపు నిచ్చారు. పట్టణంలోని చెలికాని రామారావు స్మారక భవనంలో ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా నాట్యమండలి సమావేశం జరిగింది. కోనసీమ జిల్లా కన్వీనర్ వి.శ్యామిల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డాక్టర్ స్టాలిన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజానాట్య మండలి రాష్ట్ర సమితీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఉభయ గోదావరి జిల్లాల పాటల శిక్షణ శిబిరం ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. తూర్పుగోదావరి జిల్లా కవన్వీనర్ మహంతి లక్ష్మణరావు, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర ఎం.కుమారస్వామి ఉభయగోదావరి జిల్లా సభ్యులు ఎం.ప్రేమానందం, అర్జున్, టీవీవీ రమణ, సీపీఐ నాయకులు పి.రాము, ఎస్.శారద పాల్గొన్నారు.

ఘనంగా గో వృషభ కల్యాణం

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని గో వృషభ కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివరాహ స్వామి విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా ఈ కల్యాణం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి సంబరం

బిక్కవోలు: కొంకుదురులోని చిన్నం వంశీయుల సత్తెమ్మ తల్లి సంబరం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏటా మాఘమాసం మొదటి ఆదివారం ఈ సంబరం నిర్వహించారు. గరగనృత్యాలు, డోలు సన్నాయి మేళాలతో అమ్మవారిని గ్రామమంతా ఊరేగించారు. చిన్నం వంశీయుల ఆడపడుచుల రాకతో గ్రామం అంతా కోలాహలంగా మారింది. అనంతరం భక్తులు అమ్మవారి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నసమారాధన చేశారు.

పరీక్షకు 601 మంది హాజరు

అనపర్తి: స్థానిక జీబీఆర్ కళాశాలలో నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షకు 601 మంది అభ్యర్థులు హాజరైనట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగాయని, రాజమహేంద్రవరం నార్త్‌జోన్ డీఎస్పీ వెంకటేశ్వరరావు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్టు తెలిపారు. మొత్తం 668 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 67 మంది అభ్యర్థులు గైర్హజరు అయ్యారని తెలిపారు.

అ'పూర్వ' కలయిక



మండపేటలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మండపేట: నాలుగు దశాబ్దాల క్రితం కలిసి చదువుకుని, ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా మళ్లీ ఒక దగ్గరకు చేరారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. 1978–79 సంవత్సరంలో పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగింది. ఉద్యోగం, వ్యాపారం, ఉపాధ/నిమిత్తం ఎక్కడెక్కడో స్థిరపడిన 90 మంది పూర్వ విద్యార్థులు వేడుకకు హాజరయ్యారు. గత జ్ఞాపకాలను స్మృతులను గుర్తుచేసుకుంటూ మురిసిపోయారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుడు గుంటూరు సాంబశివశర్మను ఘనంగా సత్కరించారు.

పూర్వ విద్యార్థులు జేసీ ప్రసాద్, దంటు శ్రీనివాస్, రాకుర్తి సత్యనారాయణ, మరకడ రాజేంద్రప్రసాద్, బోగిళ్ళ వెంకటేశ్వరరావు, వాడకట్టు వెంకటరమణ, సంకా శివాజీ, చక్కా రాంబాబు, అద్దేపల్లి రాము తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తరుణ్‌రాం

అనపర్తి: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్నేహితులు స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. దుప్పలపూడికి చెందిన చంద్రపాటి సాయి, జె.తురణ్‌రాం, మరో యువకుడితో కలిసి ముగ్గురు స్నేహితులు ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తూ ఫ్లైఓవర్ బ్రిడ్జిపైకి వచ్చే సరికి అదుపుతప్పి ఫుట్‌పాత్, రైలింగ్‌ను ఢీకొని పడిపోయారు. ఈ ప్రమాదంలో చంద్రపాటి సాయి కుడి కాలుకు తీవ్ర గాయం కాగా తరుణ్‌రాం తలకు బలమైన గాయమైంది. క్షతగాత్రులను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి, సిబ్బంది వైద్య సేవలు అందించారు. ఇదిలా ఉండగా తరుణ్‌రాంను మెరుగైన వైద్య సేవలు నిమిత్తం రాజమహేంద్రవరం సర్వజన ఆసుపత్రికి తరలించినట్టు వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆలమూరు: 216 ఏ జాతీయ రహదారిలోని చొప్పెల్ల వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం రావులపాలేనికి చెందిన ఎస్.శ్రీనివాసు, కుమార్తె అంకిత ద్విచక్రవాహనంపై స్థానిక బస్టాండు సెంటర్‌లో రోడ్డు దాటుతున్నారు. అంతలో రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వైపు వస్తున్న కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయాల పాలైన తండ్రి, కుమార్తెను ఎన్‌హెచ్ అంబులెన్స్ సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు ఎస్సై ఎస్.శివప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నయనానందం.. నర్తనోత్సవం..



ఆనంద నర్తనోత్సవం ప్రారంభిస్తున్న మల్లిబాబు, ఐఎస్ఎన్ తదితరులు



చిన్నారుల నృత్యప్రదర్శన

- నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్న చిన్నారులు
- విజేతలకు బహుమతుల ప్రదానం

మండపేట: కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్రనాట్యం, జానపద నృత్య ప్రదర్శనలతో ఆనంద నర్తనోత్సవం-3 కనుల పండువగా జరిగింది. వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన చిన్నారులు తమ నృత్య ప్రదర్శనలతో అందరిని అలరించారు. మండపేటకు చెందిన గిరిజా కూచిపూడి నాట్య అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక సూర్యఫంక్షన్ హాలులో ఆదివారం ఆనంద నర్తనోత్సవం-3 ఘనంగా జరిగింది. మండపేట, పరిసర గ్రామాలతో పాటు విజయవాడ, విశాఖపట్నం, గుడివాడ, ఆశ్వారావుపేట తదితర ప్రాంతాల నుంచి 250 మంది చిన్నారులు, నాట్య గురువులు హాజరయ్యారు. కూచిపూడి, భరతనాట్యం తదితర సాంప్రదాయ కళారూపాల్లో 38 గ్రూపు, 43 సోలో ప్రదర్శనలిచ్చారు. ఈ వేడుకను తాపేశ్వరం సురుచి ఫుడ్స్ అధినేత పోలిశెట్టి మల్లిబాబు, పట్టణానికి చెందిన ఐఎస్‌డీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు యినపకోళ్ల సత్యనారాయణ (ఐఎస్ఎన్) ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు ద్వారా సాంప్రదాయ కళలతో పాటు కళాకారులకు మంచి ప్రోత్సాహం లభిస్తుందన్నారు. కార్యక్రమం నిర్వాహకులు, శ్రీగిరిజా కూచిపూడి నాట్య అకాడమీ నాట్యాచార్యులు గిరిజ సంపత్ మాట్లాడుతూ నాట్య అకాడమీ ఏర్పాటు చేసి 15 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గత రెండేళ్లుగా నిర్వహించిన నర్తనోత్సవానికి మంచి స్పందన రావడంతో ఈ ఏడాది ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమం నిర్వాహకులను ఈ సందర్భంగా మల్లిబాబు, ఐఎస్ఎన్ తదితరులు ఘనంగా సత్కరించారు. పట్టణ ప్రముఖులు బిక్కిన చిన్న, కొనగళ్ల విశ్వనాథం, నాట్య గురువులు తదితరులు హాజరయ్యారు.